క్లుప్తంగా

క్రీడాకారులను ప్రోత్సహించాలి



సిరివాడ యువతకు జర్కీలను అందజేస్తున్న బూరాడ అప్పలరాజు

పెద్దాపురం: క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గుడివాడ కృష్ణాశ్రమ గురువు గవరసాని గోపాలకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బూరాడ అప్పలరాజు గ్రామంలో కబడ్డీ క్రీడాకారులకు మంగళవారం జర్కీలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. అనంతరం జర్కీలను గోపాలకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు



సామర్లకోట బస్సు కాంప్లెక్స్ వద్ద గాయపడిన మహిళ

సామర్లకోట: స్థానిక అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ ఎదురుగా ఆర్టీసీ బస్సు పెనుమాక లక్ష్మి(60) అనే మహిళను ఢీ కొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం డిపోనకు చెందిన ఏపీ29జెడ్ 3952 బస్సు రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతూ.. స్థానిక బస్సు కాంప్లెక్స్ వద్ద కాంప్లెక్స్ నుంచి బయటకు వస్తున్న మహిళను ఢీకొట్టింది. ముందు చక్రం మహిళ కాలి మీదుగా పోయింది. దాంతో అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెచ్‌సీ పీ ఎస్ రాజు గాయపడిన మహిళను ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి ఆటోలో వచ్చిన మహిళకు ఆస్పత్రి సిబ్బంది వైద్యం ప్రారంభించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ టి.సునీత దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



కళ్ల జోళ్లు పంపిణీ చేస్తున్న ముప్పన వీర్రాజు

పెద్దాపురం: పట్టణ పరిధిలో నివసిస్తున్న 194 మంది చేనేత కార్మికులకు ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు మంగళవారం స్థానిక చేనేత కార్మిక సహకారం సంఘ భవనంలో కళ్లజోళ్లను అందజేశారు. చేనేత సహకార సంఘం మేనేజర్ తూతిక చంద్రశేఖర్ మాట్లాడుతూ ముప్పన వీర్రాజు ఆర్థిక సాయంతో 194 మందికి కళ్లజోళ్లు, రూ.500 చొప్పున నగదు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు తూతిక సత్యన్నారాయణ, గొల్లా అచ్చారావు, చప్పటి సత్యన్నారాయణ తదితరులు ఉన్నారు.

కార్మికుడి మృతికి సంతాపం



ఐఎంఎఫ్ఎల్ డిపోలో సంతాపం ప్రకటిస్తున్న నాయకులు

సామర్లకోట: స్థానిక ఐఎంఎఫ్ఎల్ డీపోలో హమాలీస్ యూనియన్ కార్యదర్శిగా పని చేస్తున్న నారపాటి వీరబాబు(37) మృతికి డిపో కార్మికులు మంగళవారం సంతాపం తెలిపారు. ఇటీవల పెద్దాపురం పరిధిలో ఆగి ఉన్న లారీని ఢీకొని వీరబాబు మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు హమాలీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, డిపో ఏఎం రమణబాబు, సూపర్‌వైజర్ త్రిమూర్తులు, హమాలీస్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామచంద్రరావు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన తిరుపాణ్యం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న రామచంద్రరావును కాకినాడ కళాశాలకు నియమించారు. 2006లో రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించి 11 పీహెచ్‌డీలకు గైడ్‌గా, జర్నల్స్ 96 ప్రచురించడంతో పాటు యూఎస్‌లో ప్రతిష్ఠాత్మక రామస్ పోస్ట్ డాక్టరల్ ఫైల్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావును కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరి రామ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, నాగేశ్వరరావు, ఎలియా, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది అభినందించారు.

అధనపు.. భారం!

- గ్యాస్ వినియోగదారులకు కేంద్ర సర్కారు షాక్..
- ఇన్సూరెన్సు పేరుతో రూ.236 వసూలు
- భద్రత కోసమే అంటున్న డీలర్లు



గ్యాస్ వినియోగదారుల నుంచి బీమా రుసుము వసూలు చేస్తున్న సిబ్బంది



సామర్లకోటలో గ్యాస్ ఏజెన్సీ

సామర్లకోట: గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం మోపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజల కు ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా రద్దు చేసి గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,082కి పెంచింది. దీంతో పండగ సీజన్‌లో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అతి పేద వారి నుంచి ధనవంతుల వరకు గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నారు. అందరికీ ఒకే ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేద, మధ్య తరగతి ప్రజలు కట్టెలు, బొగ్గు, ఊక పొయ్యిలను ఉపయోగించే వారు. అయితే ప్రజల ఆరోగ్యం కోసం గ్యాస్ సిలిండర్లను ఉపయోగించుకోవాలని దీపం కనెక్షన్ పేరుతో పేదలకు గ్యాస్ పొయ్యిలపై అలవాటు చేశారు. దాంతో గ్యాస్ వినియోగం పెరిగింది. ప్రతి ఒక్కరూ గ్యాస్ వినియోగించడంతో ప్రభుత్వం సబ్సిడీని రద్దు చేసి పేద, సామాన్య ప్రజలపై భారం పడేలా చేసింది.

ప్రస్తుతం అదనపు భారం... : గ్యాస్ వినియోగిస్తున్న వారికి అదనపు భారంగా ఇన్సూరెన్సు పేరుతో రూ.236 వసూలు చేస్తున్నారు. హెచ్‌పీసీఎల్ కంపెనీకి చెందిన ప్రతినిధులు గ్యాస్ సిలిండర్ లీక్‌లు, రెగ్యులేటర్, గ్యాస్ పైపులను పరిశీలించి ఐదేళ్లలో ఏ ప్రమాదాలు జరిగినా బీమా వర్తిస్తుందని రూ.236 వసూలు చేస్తున్నారు. రెగ్యులేటర్, పైపుల నాణ్యత లోపిస్తే వాటిని మార్చుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఈ బీమాకు సంబంధించిన ఎటువంటి ప్రతాలు వినియోగదారులకు అందజేయడం లేదు. సొమ్ము వసూలు చేసిన సమయంలోనే గ్యాస్ కనెక్షన్‌ను పరిశీలన చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అందరికీ ఒకే ధర అన్యాయం



గుడిసె ఉన్న వ్యక్తి నుంచి రిలయన్స్ అంబానీ వరకు గ్యాస్ ధర ఒకే విధంగా ఉండడం అన్యాయం. పేద ప్రజలకు గ్యాస్‌పై కనీసం 30 శాతం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. అనేక మందికి గ్యాస్ వినియోగంపై అవగాహన లేదు. గ్యాస్ స్టౌ వద్ద మాత్రమే గ్యాస్ కడుతున్నారు. రెగ్యులేటర్ వద్ద కట్టడం లేదు. దాంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి డీలర్లకు చెందిన సిబ్బంది రెగ్యులేటర్, పైపులను తనిఖీలు చేసి సూచనలు ఇవ్వాలి. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది భద్రత నిమిత్తం, బీమా వస్తుందని రూ.236 వసూలు చేశారు.

– కాళ్ల లక్ష్మీనారాయణ, గ్యాస్ వినియోగదారుడు, సామర్లకోట

గ్యాస్ ప్రమాద బీమాకు ఒత్తిడి లేదు



గ్యాస్ వినియోగ సమయంలో ప్రమాదాలు జరిగితే సంస్థ నుంచి వినియోగదారుడికి నష్ట పరిహారం చెల్లిస్తాం. ఈ మేరకు ఐదేళ్లకు ఒకసారి రూ.236 చెల్లించాలి. ప్రమాదాన్ని బట్టి నష్ట పరిహారం ఉంటుంది. గ్యాస్ వినియోగంపై వినియోగదారులకు నెలకు నాలుగు పర్యాయాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బీమాకు సంబంధించి ఒత్తిడి లేదు. బీమా చేయించుకోవడం మంచిదే. సంస్థ సిబ్బంది రెగ్యులేటర్, పైపు కాలపరిమితిని బట్టి వినియోగదారులకు సూచనలు ఇస్తారు.

– గుమ్మెళ్ల రామకృష్ణ, గ్యాస్ డీలరు, సామర్లకోట

అందరి సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన



సామర్లకోట మండలం పీబీ దేవం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో దవులూరి దొరబాబు

సామర్లకోట: అందరి సంక్షేమమే లక్ష్యంగా జగన్‌పాలన సాగుతుందని ఈ మేరకు గత మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించ డానికి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉపసర్పంచ్ మలకల సత్య, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబులతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వచ్చిన పథకాల వివరాలను వివరించారు. పింఛన్ల పంపిణీ, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, మహిళా సంఘాలకు ఉచిత వడ్డీ, రుణమాఫీలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జీఓ-1 రద్దు చేయాలని వినతి

సామర్లకోట: ప్రభుత్వం జారీ చేసిన జీఓ-1 రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారికి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు గణపతి నగరం వాటర్ ట్యాంకులు, తహసీల్దార్ కార్యాలయం వద్ద జీఓ కాపీలను దహనం చేశారు. 1861 బ్రిటిష్ నాటి చట్టాన్ని తీసుకు రావడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు ఎ.అమలావతి, టి.నాగమణి, ఎస్తేరు రాణి. ఇ. మహాలక్ష్మి, డి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నంబర్- 1 జీఓ కాపీలు దహనం

పెద్దాపురం: జీవో నంబర్-1 తక్షణమే రద్దు చేయాలంటూ సీఐటీయూ పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జీఓ కాపీలను దహనం చేశారు. సీఐటీయూ అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, మాగాపు నాగు, వరలక్ష్మి, తులసీ, వసంతకుమారి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు వినాయకుడు గుడి వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1861 బ్రిటిష్ కాలం నాటి చట్టాన్ని ఇప్పుడు అమలు చేయాలని చూడడం సరికాదన్నారు. తక్షణమే జీఓను రద్దు చేయాలని కోరారు. అనంతరం జీఓ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో డి.క్రాంతికుమార్, ఉమామహేశ్వరి, టీఎల్ పద్మ, కాలే దేవి, పీఎస్ఎం నాయకులు కేదారి నాగు, తైనాల శ్రీను, వడ్డి సత్యనారాయణ, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని అడుగుతున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ప్రధాన సమస్యల పరిష్కారంకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన మంగళవారం పిఠాపురం 9వ వార్డు సచివాలయ పరిధి మోహన్‌నగర్‌లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వారికి అందుతున్న పథకాలను చదివి వినిపంచి అవన్నీ అందుతున్నాయా లేదా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. గత టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఒక్క పథకం కూడా అందకుండా వివక్షత చూపించారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా పథకాల పంపిణీ చేస్తున్నామన్నారు. టీడీపీ నేతలకే పదకాలు ఇస్తున్నామని వివక్షత అనేది ఎక్కడా లేకుండా ప్రభుత్వ పథకాలు పంపిణీ చేస్తు పారదర్శకంగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలు పరిషత్ బడ్జెట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మండల పరిషత్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మంగళవారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన గొల్లప్రోలు మండల పరిషత్ బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎన్నడు లేని విధంగా మండల పరిషత్‌లకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటులు మంజూరు చేస్తోందన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా మరిన్ని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా 2023-24 ఆర్థిక సవంత్సరానికి రూ 19.01,58,400 రాబడులు ఉండగా రూ 19,00,87,400 ఖర్చులతో రూ.71000 మిగులు బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను వివరించగా సభ్యులు తమ గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, వైస్ ఎంపీపీలు నేమాని ఆదివిష్ణు, బత్తిన మంగ, ఎంపీడీఓ శర్మ, తహసీల్దారు వెంకటేశ్వరరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

కొత్తపల్లి: కొండెవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు తెలిపారు. నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 2 గ్రామ సచివాలయాలకు మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇందిరా కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

పన్నులు చెల్లించి.. అభివృద్ధికి సహకరించండి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని మండల విస్తరణ అధికారి భాస్కరరావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటి, కుళాయి పన్నులను ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించాలన్నారు. పన్నులు వసూలు చేసేందుకు గ్రామ వలంటీర్లు డోర్ టు డోర్ వస్తారని తెలిపారు. మొండి బకాయిలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. కుళాయిలకు అక్రమంగా మోటార్లు అమర్చుకున్న వారు తొలగించాలని హెచ్చరించారు.

భాష్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సామర్లకోట: సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్థానిక భాష్యం స్కూల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. పిల్లలు హరిదాసు, సొదెమ్మ, రైతులు, కొమ్మదాసులు, బుడబుక్కల వాళ్ల వేషధారణలో అలరించారు. చిన్నారులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ఈ మేరకు చిన్నారులకు భోగి పళ్లు వేశారు. భాష్యం ప్రిన్సిపాల్ సూర్య భోగి పండగ ప్రాధాన్యాన్ని, సంక్రాంతి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష, భాష్యం విద్యాసంస్థల అధినేత రాఘకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి వి గోవిందరాజులు పిల్లలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల ఆందోళన

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ నంబర్ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ, ఆశా, భవన నిర్మాణ కార్మికులు ఆందోళన నిర్వహించారు. తహసీల్దారు శివకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు కె.నాగేశ్వరావు మాట్లాడుతూ కనీస వేతనాన్ని రూ.26వేలు, ఈనెల 27, 28 తేదీల్లో బెంగళూరులో జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ, ఆశ మండల అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఎ.వాసు, సీహెచ్ పద్మాకరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం జంక్షన్ వద్ద ట్రస్ట్ ఆస్పతి న్యూ ఇయర్ టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆవిష్కరించారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి, మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని కోరారు.

సంక్రాంతి సమేత.. వీరరాఘవ..

- ఏటిపట్టులో ఏటా పండగ సందడి తెచ్చే హరిదాసు
- 36 ఏళ్ల క్రితం ఖమ్మం జిల్లా నుంచి తూర్పునకు రాక
- జీవనాధారం లేక వంశపారం పర్యంగా ఇదే వృత్తి
- ప్రభుత్వం ఆదుకోవాలని వీర రాఘవరావు విజ్ఞప్తి



చదలాడలో ఇంటింటికీ తిరుగుతున్న హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళ

పెద్దాపురం: నెల రోజులు కష్టపడితే వచ్చిన ఆ బియ్యమే ఏడాది పొడవునా ఆ కుటుంబ పోషణ. కనీసం వేరే వృత్తిలోకి వెళదామంటే.. హరిదాసు వృత్తి వదల్లేని పరిస్థితి. పొట్ట చేత్తో పట్టుకుని రాష్ట్రం కాని రాష్ట్రం, జిల్లా కాని జిల్లాలో హరిదాసు వేషధారణలో తిరుగుతున్న వీర రాఘవరావు(హరిదాసు) వచ్చాడంటే చాలు పెద్ద పండగ వచ్చినట్టే..

సంక్రాంతి సంప్రదాయాల్లో భాగమైన హరిదాసు ఇంటి గుమ్మం తట్టగానే సంక్రాంతి వచ్చినట్టే. అనాది కాలం నుంచి హరిదాసులు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, రంగుల హరివిల్లుతో ప్రతి ఇల్లు కళకళాడుతుంది. అయితే ప్రస్తుతం వేకువ జామున ఇంటిగుమ్మం తట్టే హరిదాసులు తక్కువయ్యారని చెప్పొచ్చు. అయితే వంశపార పర్యంగా వస్తున్న వృత్తిని వదల్లేక ఖమ్మం జిల్లా సత్తుపల్లి చెందిన బొమ్మకంటి వీర రాఘవులు తన తండ్రి నరసింహులు 36 ఏళ్ల నుంచి హరిదాసు వేషధారణలో పెద్దాపురం మండలంలో పర్యటిస్తున్నారు. ఇంటింటికి బైక్‌పై తిరుగుతూ నెల రోజుల పాటు పెద్దాపురం మండలం తాటిపర్తి, పులిమేరు, చంద్రమాంపల్లి, చదలాడ, దివిలి, గుడివాడ, కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామాల్లో పర్యటించి వచ్చిన బియ్యాన్ని విక్రయించి.. ఆ సొమ్ములతో ఏడాది పాటు కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి.

పింఛను మంజూరు చేయాలి



వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తితోనే కాలం వెల్లదీస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదు. సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పందించి కనీసం కళాకారుడి పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నాను.

– నీలల నరసింహదాసు, లంకపల్లి, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



సామర్లకోటలో సీఐటీయూ జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సామర్లకోట: ఈనెల 18 నుంచి 27 వరకు బెంగళూరులో జరిగే సీఐటీయూ 17వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు పిలుపు నిచ్చారు. ఈ మేరకు పట్టణ పరిధిలో మెహర్ కాంప్లెక్స్‌తో పాటు అనేక ముఖ్య కూడలి ప్రదేశాల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలం శ్రీనివాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, దీనిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నరవ సురేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రకృతి ఈశ్వరరావు, రాష్ట్ర హమాలీస్ యూనియన్ కార్యదర్శి విప్పర్తి కొండలరావు, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు కరణం ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు టి.నాగమణి, కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, చల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

పెద్దాపురం: బెంగళూరులో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతం కోరుతూ అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం పెద్దాపురం పట్టణంతో పాటు చంద్రమాంపల్లి, ఆనూరు, కట్టమూరుల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ సీఐటీయూ ఐక్యత పోరాటం నినాదంతో పనిచేస్తుందన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, స్కీము వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ మహాసభలో కార్మిక సమస్యలపై చర్చించనున్నారన్నారు. జెండాను చింతల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, పెదబాబు, శివ., జాన్, శ్రీను, ప్రసాద్, ఉమామహేశ్వరి, కరక సుబ్బలక్ష్మి, వడ్డి సత్యనారాయణ, సిరిపురపు మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.